# వంటమనిషి

నా దురదృష్టవశాత్తూ మా ఆవిడ పుట్టింటి వారికి రెండెకరాల మాగాణి ఉంది. న్యాయంగా — ఆడపిల్ల పుట్టినింటివారి ఆస్తిపాస్తుల వల్ల అల్లుడికి దురదృష్టం కలగనక్కరలేదు. కాని నాకు కలిగింది.

చదువనీ, వ్యాపారమనీ, ఉద్యోగమనీ దేశాలు బట్టి తిరిగి, మరీ గిడసబారి పోయాక నా ముప్ఫై రెండో యేట ఈ తాయారుని పెళ్ళి చేసుకున్నాను. అప్పటికి కుటుంబంలో ఆనవాయితీ ప్రకారం నాకు చాలా మట్టుకు జుత్తు ఊడిపోయింది. నల్లగా ఎండిపోయిన వేపకాడలాగ ఉండేవాడిని. తాయారుకి నా పెళ్ళికి ఇరవయ్యేళ్ళు. చిలకలాగ ఉండేది.

పెళ్ళిలోనే పెద్ద ముత్తయిదువలు ఒకరిద్దరూ 'ముసలి మొగుడూ — పడుచు పెళ్ళాం. బాగానే కలిసింది' — అంటూ మా తాయారుని ఏడిపించారట. అందుకు మా తాయారు ఏడవలేదు కాని, ఆ కారణంగా నా మీద ఆధిక్యతను సంపాదించవచ్చునని కాబోలు మనసులో సంతోషించింది. ఈ విషయం ఆమె మాటల ద్వారా, ప్రవర్తన ద్వారా నేను కనిపెట్టాను. వయస్సు ద్వారా, విజ్ఞత ద్వారా, అనుభవం ద్వారా నామీద లేని ఆధిక్యత — ఆ ముసలి ముత్తయిదువల ధర్మమంటూ ఈవిధంగా సాధించింది తాయారు.

ఇన్నిటికీ మించి నేను మంచివాడిని. టిఫిన్ కారేజీలతో, సిగరెట్టు పెట్టెల్తో, సినిమా మాగజైన్లతో విసుగెత్తి పోయిన ఈ యింట్లో ఒక అమ్మాయి, అదిన్నీ మా తాయారంత అందమయిన అమ్మాయి తిరగడం ఎంతో ముచ్చటనిపించేది. దానికి ప్రతిఫలంగా నా భర్తృత్వపు హక్కులన్నీ కోల్పోయానని తర్వాత్తరవాత తెలిసి వచ్చింది.

మాకు నలుగురు పిల్లలు పుట్టి – ఆవిధంగా ఈ యింట్లో తాయారు మరింత నిలద్రొక్కుకున్నాక – అది కేవలం నియంత అయిపోయింది. హఠాత్తుగా నేనూహించని క్లిష్ట స్థితి యీ యింటికి దాపురించిందని అర్థమయి హడలిపోయాను. ఆ స్థితి మరేమీకాదు: ఒక్కొక్కటే చెప్తాను–

మూడొందలు తెచ్చుకునే కొంపలో – పిల్లలున్న కొంపలో – ఏవంకాయో, ఆకుకూరలో, దొండకాయలో, బెండకాయలతోనో రోజు గడవాలా? – మా యింట్లో బంగాళాదుంపలు, కారెట్, బీట్‌రూట్, బీన్స్ తిన్నంత తిని పారేసినంత పారేసేవారు.

వంకాయ మధ్యతరగతి బ్రతుక్కు చిహ్నమయితే, బంగాళాదుంపకూర 'లగ్జరీ' అని నా ఉద్దేశం

'ఏమే!' అని అడిగితే –

"సుఖంగా బ్రతకడం మీకేం తెలుసు? – సుష్టుగా పిల్లలకి తిండయినా పెట్టలేనంత నికృష్టంగా బ్రతుకుతున్నామా మనం?" అంది.

అది మంచి ఆలోచనే. పిల్లల్ని బాగా పెంచుతున్నామన్న మెత్తటి ఆలోచన కొంత ఓదార్పే మరి. వాళ్లు 15 రూపాయల తక్కువ ఖరీదు బూట్లు వెయ్యగా చూడలేదు.

తమ బూట్లకంటె మా వాళ్ళ బూట్లు బాగున్నాయని బాధపడి తాశీల్దారుగారి అబ్బాయిలు – బడిలో బ్లేడుపెట్టి మా వాళ్ళ బూట్లు అడ్డంగా కోసేశారు. నిజమే. తమకి సుఖం ఉండడమంటే – ఇంకోకరికి లేకపోవడమనే సంప్రదాయంలో పెరుగుతున్నవాళ్ళు వాళ్ళు.

కాని మా ఆవిడకి చెడ్డకోపం వచ్చింది.

"ఓర్వలేనితనంతో వెధవల కళ్లు కుట్టాయి. ఎంత పెద్దింటి వాళ్లయితే మాత్రం బుద్ధులెక్కడికి పోతాయి?" అని వాళ్ళని పది తిట్టినా వెంటనే బజారుకి వెళ్ళి మళ్ళీ అందరికీ బూట్లు కొని తెచ్చింది.

"పోనీ యిప్పుడే కొనకపోతే నేం? బూట్లు చింపిన తృప్తి వాళ్ళకి కొన్నాళ్లు మిగలనీ. మళ్ళీ వీటినీ రేపు వాళ్లు కోసేస్తే?" అంటే –

నేనే ఆ తాసీల్దారునయినట్టూ వాళ్ల పిల్లల బుద్ధులకి నేనే బాధ్యుడినయినట్టూ నా మీద విరుచుకుబడి : "అంతే. పెద్ద బుద్ధులు ఎలా వస్తాయి? ఎప్పుడూ ఒకరికి ఒదిగి బ్రతకడమెలాగని ఆలోచిస్తారు మీరు" అంది.

అయినా పెద్దబుద్ధులు ఖరీదయిన బూట్లలో ఎలా ప్రతిఫలిస్తాయో అర్థంకాక నోరు మూసుకొన్నాను. అదీగాక – వాళ్ల నాన్నకి రెండెకరాల మాగాణీ ఉన్నదాయె. అయితే ఆ నెల ఓ స్నేహితుడి దగ్గర 40 రూపాయలు చేబదులు తీసుకురాక తప్పలేదు.

ఓసారి ఏదో పేరంటానికి వెళ్ళి – "చూశారూ ఆ హనుమాయమ్మగారి మిడిసిపాటు?" అంటూ వచ్చింది.

"నేనెక్కడ చూశాను?" అన్నాను.

"వాళ్ళబ్బాయి కోయంబత్తూరు నుంచి చుట్టు జల్తారు చీరె పంపాడట – ఇంతోటి చీరా యిక్కడ లేనట్టు. పేరంటమంతా రెపరెపలాడించుకొంటూ తిరిగింది" అంది.

"నీ చీరా బాగుంది కదా? నువ్వూ తిరగలేకపోయావా అవిడ వెంబడే" అన్నాను– వంటికి ఉన్న అర్వై రూపాయల చీరెని చూస్తూ.

"ఛీ ఛీ! ఇదీ ఒక చీరేనా? – ఈ మాటు పేరంటానికి పిలవనియ్యండి, ఆవిడ రోగం కుదురుస్తాను" అని శపథం చేసింది.

ఆ హనుమాయమ్మగారి రోగానికి, నా జీతానికీ ఏదో సంబంధం గుర్తుకొచ్చి నా గుండెల్లో రాయిపడింది.

ఆవిడరోగం నువ్వు కుదర్చకపోతేనేం? అందామనుకొన్నాను కాని దానికీ ఏదో సమాధానం తాయారు దగ్గర సిద్ధంగానే ఉంటుంది.

ఈ మాటు ఆ హనుమాయమ్మగారు పేరంటానికి ఎప్పుడు పిలుస్తారా అని బెంగ పెట్టుకున్నాను. ఆఖరికి పిలవనే పిలిచారు.

జీతం వచ్చిన మూడో రోజు సాయంకాలం యింటికి రాగానే ఆప్యాయంగా మైసూర్‌పాక్ పట్టుకుని తాయారు ఎదురయ్యేసరికి ఆనందంతో మూర్ఛ వచ్చినంత పనయింది. తలలో గుప్పుమంటున్న మొగలిరేకు మడతా, కెంపులాంటి బొట్టూ, లిప్‌స్టిక్ రాసినట్టున్న ఎర్రటి పెదాలూ, వాటి అంచున చిరునవ్వు – సన్నగా, నాజూగ్గా ఉన్నా శరీరాన్నే అంటిపెట్టుకొని తెల్లటి చుట్టు జల్తారు .... అరె! ఈ చీరె ఎక్కడిది?" – దిగ్భ్రమతో ఆగిపోయాను.

నా ఆశ్చర్యం చూసి నవ్వి "హనుమాయమ్మగారింటికి పేరంటానికి వెళ్ళానండీ" అంది.

"అయితే యిదేనా ఆవిడ కొనుక్కొన్న చీరె...."

"మీది మరీ చోద్యమండీ. ఆవిడ చీరె కట్టుకొనే ఖర్మమేం నాకు? ఇది నాదే" అంది.

"ఎక్కడిదీ?" అన్నాను సగం ప్రాణంతో.

"బట్టలవాడు వస్తే తీసుకొన్నాను. ఒక్కసారే డబ్బంతా యివ్వనక్కర లేదులెండి. రెండు వాయిదాల్లో యివ్వొచ్చట, ఇప్పుడు అరవయ్యే యిచ్చి పంపాను. ఈ దెబ్బతో హనుమాయమ్మగారి పొగరు దిగిపోయింది. వెర్రి మొహం వేసుకు నా చుట్టూ తిరిగింది"

"మరి యీ నెల యింటి ఖర్చుల మాటేమిటి?" అన్నాను.

"ఈ నెలకి ఎక్కడయినా ఓ అర్వై చేబదులు తీసుకోండి. ఏదో సరిపెట్టుకుందాం" అంది. అర్వై తెచ్చాక కూడా యింకా సరిపెట్టుకోవడమేమిటి?

"తాయారూ! మనం ధనవంతులం కాదు. ఈ చీరె ఖరీదు దాదాపు నా సగం జీతం.

ఇలా అయితే యీ సంసారం ఎలా గడవను?" అన్న మాటలు నోరు జారాయి, అంతే -

చర్రున లోపలకి వెళ్ళి కొత్తచీర ఉమ్మచుట్టి తెచ్చి నా కుర్చీముందు పారేసింది. "అంతే లెండి. మీ పెళ్ళాం తృప్తిపడితే మీరు చూడలేరు. అరువు సంపాదించినదుకయినా సంతోషం లేదు. ఇచ్చెయ్యండి - ఆ బట్టలవాడికి? (వాడిని నేనెక్కడ వెతికి పట్టుకోను!) నాకు చీరావద్దు, చట్టుబండలూ వద్దు. ఈ సంసారంలో యిలా పిల్లల కోడిలాగ యీదుతూ ఉంటాను. అంతే నా ఖర్మ. పచ్చగా బ్రతకడం తెలీనిచోట పిల్లనిచ్చుకొంటే యిలాగే బ్రతుకులు గడుస్తాయని ఆ ముసలాళ్ళకేం తెలుసు?" అంటూ రెండు తరాలకి సరిపడ దీవెనలు కుమ్మరించింది.

తరువాత నేను పడ్డ పాట్లు ఎలా ఉన్నా చీరె యివ్వడం మాత్రం జరగలేదు. ఇలాంటివి జరుగుతాయని తెలుసు కాబోలు ఆ బట్టలవాడూ మరి రెండు వారాలు పత్తా లేకుండా పోయాడు. ఆ హనుమాయమ్మగారికి పరాభవం జరిగిందో లేదో తెలీదు కాని, నేను 60 రూపాయల అప్పుమాత్రం తెచ్చాను.

ఆ సంతోషంతో ఆ వారం మూడుసార్లు సేమ్యా పాయసం చేసింది. రెండు సార్లు హల్వా, ఒకసారి మైసూర్‌పాక్, బొబ్బట్లూ చేసి - నెయ్యి, పంచదార అయిపోయిందని వారం రోజులకే తేల్చింది.

పైపెచ్చు నేను చాలా ఆదర్శమూర్తి అయిన భర్తనని యీ వారంలో చాలాసార్లు గుర్తుచేసింది. ఆ అర్హతని అంత త్వరగా పోగొట్టుకోవడం యిష్టం లేక - అయిపోయిన సామానులన్నీ నోరుమూసుకొని భర్తీ చేశాను.

ఆ నెల నాకు అనర్థం దాపురించిన నెల. పనికట్టుకు వచ్చి మా కొబ్బరినూనె సీసాలో పడి రెండు ఈగలు ఆ నెలే ఆత్మహత్య చేసుకున్నాయి. మా ఆవిడకి కోపం వచ్చింది. వాటి తెగులు కుదర్చడానికి (లేక నాదో!) ఆ కొబ్బరినూనెతో వీధి అరుగుమీద దీపాలు పెట్టించి, మంచి వాసననూనె సీసా ఒకటి తెప్పించింది.

కొత్తగా పక్కింట్లో దిగిన అరవ్వాళ్ళ కోడలు ఓ రోజు మా ఆవిడ్ని కాఫీకి పిలిచి యిల్లంతా కలియదిప్పి చూపించిందట. ఆ కోడలు నాన్న - తిరుచునాపల్లిలో పెద్ద స్టీలు సామాన్ల షాపు ప్రొప్రయిటరు. అందుకని ఆ వంటిల్లంతా స్టీలు సామాన్ల మయంగా ఉందట. చెంచాలు, గిన్నెలు, చెంబులు, బాల్చీలు, గరిటెలూ - ఒకటేమిటి? అన్నీ స్టీలుసామాన్లే.

ఇవన్నీ రాత్రి వివరిస్తే నేను హడలిపోయాను. "వాళ్ళ నాన్నకి మరో అమ్మాయి ఉందేమో కనుక్కో.. మన బాచిగాడికి యిస్తారేమో కనుక్కొందాం" అన్నాడు -

"పోండి - మీ వేళాకోళాలు మీరూను" అనేసింది కాని, ఆ స్టీలు ఆలోచన బుర్రలో పనిచేస్తోందనుకొంటాను. క్రమంగా మా యింట్లోని నిక్షేపంలాంటి యిత్తడి గిన్నెలన్నీ స్టీలుగిన్నెలయిపోవడం ప్రారంభించాయి.

"ఎలా?" అని నేనడగలేదు. అడిగితే అప్పు తీసుకురమ్మంటుందని భయపడ్డాను.

తరువాత చెప్పింది. ఇత్తడి గిన్నెల్ని మూడోవంతు నష్టంమీద పుచ్చుకొని, స్టీలు గిన్నెలు యిచ్చేటట్టు ఓ షావుకారు ఒప్పుకున్నాడట. పైగా పదిరూపాయల చీటీ ఒకటి కట్టడం ప్రారంభించినట్టు చెప్పింది.

ఈ పరిస్థితుల్లో మా యింట్లో ఓ తద్దినం వచ్చింది. సుఖాలూ, కష్టాలూ చెప్పిరావు. కనక ఆ రోజు అలాగే చెప్పక వచ్చిపడ్డాయి. తెల్లవారేసరికి మా ఆవిడ వసారాలో కెళ్ళి కూచొంది.

స్నానం చేసి నేనే వంటయింట్లోకి జొరబడబోయాను.

"అయ్యో! అంతవంటా మీరొక్కరూ ఎలా చేస్తారు? ఉండండి, నేను ఏర్పాటంతా చేయించాను" అంది.

తెల్లబోయాను అర్థంకాక.

"మూడో యింట్లో ఉన్న లక్ష్మీబాయమ్మగారింట్లో ఓ వంటమనిషి పనిచేసేదట. ఆవిణ్ని పిలుచుకురమ్మని పనిమనిషిని పంపాను. రెండు రూపాయలు పారేస్తే రోజు పనంతా చకచకా చేసుకుపోతుంది" అంది.

బ్రతుకు జీవుడా! అనుకొన్నాను. ఆ రోజు పితృదేవతలు తరించేలాగా తద్దినం గడిచిపోయింది.

రాజమ్మది అసలు తిరునెల్వేలి. పదేళ్ళ కిందట యీ ప్రాంతానికి వచ్చి సెటిల్ అయిపోయింది. మనిషి ముత్యంలాగ శుభ్రంగా ఉంటుంది. వంట కూడా శుభ్రమే. గారెలు, నువ్వుల పప్పు పచ్చడీ దివ్యంగా చేసింది. వంటలన్నింటినీ పిల్లలు పొద్దుటే ఊదేశారు.

సాయంకాలం యిన్ని బెండకాయలు వేయించి, అత్తెసరు పడేసి రెండు రూపాయలు పుచ్చుకు వెళ్ళిపోయింది రాజమ్మ.

మొదటిసారిగా మా ఆవిడ సమయస్ఫూర్తికి జోహారులర్పించాను. నాలుగు రోజులదాకా రాజమ్మ వంట మధుర స్వప్నంలాగ పిల్లలంతా చెప్పుకున్నారు. నేనూ ఒకటికి రెండుసార్లు "వంట బాగా చేసింది సుమా!" అన్నాను తయారుతో.

నెలరోజులతర్వాత – ఓరోజు ఆఫీసునుంచి వస్తూనే అలవాటు ప్రకారం వంటయింట్లోకి వెళ్ళి పీట వేసుక్కూచునేసరికి రాజమ్మ కాఫీ అందించింది. ఆశ్చర్యపోయాను. "అరవ్వాళ్ళ మరదల్ని ఆసుపత్రిలో చేర్చారు కానుపుకి. అమ్మగారు చూడడానికి వెళ్లారు – నన్ను వంటచేయమని" అంది రాజమ్మ.

ఆ రాత్రి మళ్లీ ఆమె వంటరుచి చూశాం. మర్నాడు ఉదయం లెక్కప్రకారం అర్థపూటకి ఒక రూపాయి ఇచ్చి పంపేస్తుందేమోననుకొన్నాను కాని రాజమ్మని పంపెయ్యలేదు తాయారు. "నాకు ఉండుండి నడుంపోటు వస్తోంది. రెండ్రోజులు ఉండనివ్వండి. ఈ మూడు రోజులకీ అయిదు రూపాయలకి మాట్లాడాను" అంది.

నేనేం మాట్లాడలేకపోయాను. ఎందుకంటే ఆ నిర్ణయం ఆరేళ్లుగా ఆలోచించి

చేసిన నిర్ణయంలాగ, ఇక దానికి తిరుగులేనట్టుగానూ చెప్పింది.

ఆ మూడు రోజులూ చాలా రుచిగా, శుచిగా గడిచిపోయాయి. మా ఆవిడ నడుంనొప్పి తగ్గినట్లు లేదు కాని రాజమ్మ వెళ్లి పోయింది.

ఆ నెల యింటి ఖర్చుల జాబితా – ఎప్పుడూ లేనిది – నా ముందు కూచొని తయారు చేసింది తాయారు. ఆ చేయడంలో నా సిగరెట్లకు ఉదారంగా మరి అయిదు రూపాయలు ఎక్కువ కేటాయించింది.

"ఏమిటి విశేషం?" అన్నాను.

అప్పుడు కథ చెప్పింది: "అయిన ఖర్చులు ఎలాగూ అయిపోతున్నాయి. ఈ వెధవ బ్రతుక్కి సుఖం లేకుడా పోతోంది. పనులు చేసుకోలేక పోతున్నాను. అందుకని...."

"అందుకని"

"రాజమ్మని కొన్ని నెలలు మనింట్లో ఉంచుకొందాం. పిల్లలూ ఆవిడ చేతివంట అంటే పడి చస్తున్నారు. బ్రతిమాలి నలభై రూపాయలకి వప్పించాను. పిల్లలు మరీ కీచంట పడిపోయినట్టున్నారు. ఆవిడ చేతి వంటతో వాళ్ళు సరిగ్గా కోలుకొంటారు" అంది.

రాజమ్మ వంటని మెచ్చుకోవడంలో, తన వంటని హీనపరుచుకోవడం స్ఫురించలేదనుకొంటాను మా ఆవిడకి.

"నీ వంటవల్లే పిల్లలు కీచంట పడిపోతున్నారంటావా?" అన్నాను ఊరుకోక.

మెయిన్ పాయింటు వదిలి చొప్పదంటు ప్రశ్నవేసిన వాణ్ణి బుజ్జగించినట్టు ఓ చిరునవ్వు గిరాటేసి "మీరన్నీ యిలాంటి లాపాయింట్లేస్తారు. ఉండండి, రాజమ్మ పకోడీలు చేస్తోంది. తెస్తాను" అని లేచింది.

నేను ఆశ్చర్యపోయాను. కేవలం నాకు సూచనకేనన్నమాట యీ ప్రయత్నం!

ఏమయినా కానీ పకోడీలు బాగున్నాయి. రోజూ యిద్దెన్లూ మా ఆవిడకంటే బాగా చేస్తోంది. అంతకంటె కొబ్బరి చట్నీ అమోఘం. వంకాయ మెంతికూర, బచ్చలికూర పులుసు, దొండకాయ వేపుడు ఆమె ప్రత్యేకతలు. పిల్లలంతా తృప్తిగా భోజనం చేస్తున్నారు. నాకూ బాగానే ఉంది.

అయితే, ఆ నెల ప్రతినెలా అయినంత ఖర్చే అయింది. తాయారు చెప్పినట్టు ఏమీ తగ్గలేదు.

"తగ్గిస్తానన్నావు కదా" అన్నాను.

"ఈ నెల చూసుకోండి" అంది.

"అన్నం బహు కుర్వీతా" అన్నారు. ఈ నౌకరీలు, సంపాదనలూ అంతా భోజనానికే కదా? అందుకని మాట్లాడక వూరుకొన్నాను.

కాని ఉన్నట్లుండి చాలా ఉపద్రవాలు ఒకదాని వెంట ఒకటి తోసుకు వచ్చాయి. ఆదివారం ఫైళ్ళు ముందేసుకొని వ్రాసుకొంటూంటే తల దువ్వుకొంటూ నా

ముందుకొచ్చి "చూశారండీ. అంత పెద్ద జుత్తు తనకే ఉంది కదా అని ఆ రాజమ్మకు ఎంత మిడిసిపాటో? జుత్తు విరబోసుకొని అరగంట ముడివేస్తుంది." అంది తన పిలక సవరాన్ని విదిలిస్తూ.

"పోనీ, నువ్వూ నలభై నిముషాలు జడవేసుకో. ఇప్పుడు వేరే పనికూడా ఏమీలేదు కదా?" అన్నాను.

"మీకు అసలు విషయం అర్థం కాదు. ఈ మధ్య కూరల్లో, పులుసుల్లో వెంట్రుకలు వస్తున్నాయి" అంది.

"అవి నల్లగా తీగె సాగినట్టుంటే నీవేమోనని నోరు మూసుకు ఊరుకొన్నాను" అన్నాను.

మా ఆవిడకా సమాధానం నచ్చలేదు. "వంటిల్లంతా చెడతిరుగుతూ వంటజరుగు తున్నంతసేపూ తల దువ్వుతూనే ఉంటుంది. ఏమిటా పన్లు?" అని సాధించింది.

"పోనీలే ఇంత వండి పడేస్తోంది – ఊరుకో" అన్నాను.

ఏ ముఖాన ఉందో అప్పటికి ఊరుకొంది తాయారు.

మర్నాడు ఉదయం స్నానానికి వెళ్తూ– "సబ్బేదీ!" అని అరిస్తే – యిల్లంతా తిరిగి నోరునొక్కుకొంటూ వచ్చింది – "చూశారా? చూశారా?" అంటూ. "వంటమనిషికి ఎంత షోకో చూశారా? ఆ సబ్బు తీసుకెళ్ళి అరగంట స్నానం చేస్తోంది. సబ్బు యీమధ్య త్వరగా అయిపోతోందేమిటా అని అనుకొంటున్నాను. ఇదన్నమాట విషయం–" అని పళ్లు కొరికింది.

ఆ తర్వాత నెల కావాలని రెండు సబ్బులు తక్కువ తెప్పించింది.

సాయంకాలంపూట ఫలహారం ఈ మధ్య రాజమ్మ ధర్మమా అంటూ అలవాటైంది. కాని ఆ రోజు ఫలహారం అడిగితే "రోజూ ఫలహారాలేమిటి? మనమేమైనా రాజులమా? జమీందర్లామా? నెలకి ఆరు కిలోల నూనె అవుతోంది. మీకు మరీ తినాలనుంటే అలా హోటలుకు వెళ్ళి ఏమైనా తినిరండి" – అంది తయారు.

నిర్ఘాంతపోయాను. "అదేం? వంటమనిషిని డబ్బిచ్చి పెట్టుకొని, హోటల్లో తినడమేమిటి?" అన్నాను.

"వంటమనిషి వంటలు చేస్తుంది కాని సరుకులు చెయ్యదుగా! అరకిలో నూనెపోసి మూకుడు పెడితే ఎన్నిరోజులు పని గడిచేను? ఏమైనా యిక యీ యింట్లో ఫలహారాల్లేవు" అంది.

ఆ నెల నుంచి నూనె ఖర్చుకూడా తగ్గిన గుర్తు.

ఒక రోజు చీకటిపడి యింటికి చేరుతూ చవకగా అమ్ముతున్నారు కదా అని మల్లెపువ్వులు సంచీలో వేసుకువచ్చాను. ఎప్పుడూ లేనిది ఆ రోజు మనసుగా మల్లెపువ్వులు పట్టుకొని వంటగదిలో దూరాను – "తాయారూ" అంటూ. కాని నెమిలికంఠం రంగుచీరె కట్టుకొన్న వ్యక్తి యిటు తిరిగేసరికి రాజమ్మని చూసి అదిరిపోయాను.

రాజమ్మ అందమైనదే. ముప్పై ఐదుకంటె వయస్సుండదు. కొస్త నల్లగా ఉంటుందే కాని నాజూకయిన మనిషి. ఆవిడా మంచి వాసననూనె రాసుకొంది!

మా ఆవిడతో ఆమాటంటే చ్రరుమని లేచింది – రాజమ్మ అందాన్ని మెచ్చుకోవడం తప్పేమోనని అనుకొన్నాను – కాని అది కాదు విషయం.

"చచ్చీ చెడీ పదిరూపాయలు పెట్టి వాసన నూనె తెస్తూంటే – అదీ రాసుకు ఊరేగుతుందా?" అంటూ ఎగిరింది.

చచ్చీ చెడీ నేను సంపాదిస్తున్నానన్న విషయం తాయారుకి నచ్చచెప్పలేక పోయాను కానీ – రాజమ్మ అంత సులువుగా ఆమెకు అర్ధమయేటట్టు చేసింది.

తరువాత ఏం జరిగిందో మీకు చెప్పనక్కరలేదు. మా యింట్లోంచి వాసన నూనె మాయమయింది.

తరువాత్తరవాత రాజమ్మ గురించి చాలా ఫిర్యాదులు తాయారు ద్వారా విన్నాను. మా కోసం తీసుకొన్న తమలపాకులన్నీ ఆవిడే నములుతోందట. ఆదివారం మధ్యాహ్నం మాట్నీకి వెళ్తోందట. అలా వెళ్ళినప్పుడు – మంచి పెడన చీరె కట్టుకుని మరీ "నాపసాని" లాగ (ఈమాట మా ఆవిడే అంది) వెళ్తోందట.

హనుమాయమ్మగారిలోని ఈ స్వభావాలు – రాజమ్మ దగ్గరికి వచ్చేసరికి ఆడంబరాలుగా కనిపించాయి. తన స్థాయి వాళ్ళు చేస్తే అవసరాలుగానూ, క్రింది వాళ్లు చేస్తే ఆడంబరాలుగానూ చూసే దృష్టి ఈ కాలానికి కొత్తకాదు. ఇది మా ఆవిడలో నన్నమాటేమిటి? చాలా చోట్ల, చాలా రంగాలలో పీఠం వేసుకొందేమో.

పోనీ, అదంతా నా కెందుకు? తను తెచ్చి పెట్టిన వ్యక్తి మీద నాకు చాడీలు చెప్పి బాధపడవలసిన అవసరం ఏముంది అసలు? ఆవిడిని పొమ్మంటే పోతుందిగా.

ఆ మాటే అన్నాను.

"చూస్తూ చూస్తూ ఎలాగండీ పొమ్మనడం?" అంది.

అసలు విషయం ఏమిటంటే – రాజమ్మలో తప్పు కనిపించలేదు మా ఆవిడకి. నలుగురి దృష్టిలోనూ అభ్యంతరంగా కనిపించే దానికి 'తప్పు' అని గుర్తు పెట్టుకొంది మా ఆవిడ. తన దృష్టిలోనే అభ్యంతరం కనక, యిది కేవలం 'ఆక్షేపణ'గా నిలిచిపోయింది. అది తప్పని నలుగురినీ ఒప్పించడం కష్టమని తనకి తెలుసు. అందుకని కనీసం నా సాక్ష్యమన్నా దొరికితే ఆమెకి తృప్తి. కాని ఆ పనుల్లో తప్పేమీ నాకు కనిపించలేదు.

"వంట చెయ్యడానికే ఆమెను పెట్టుకొన్నాం మనం. వంట బాగా చేస్తున్నంతవరకూ ఆమెనేం అనడానికి వీల్లేదు. సబ్బు వాడుతోంది, వాసన నూనె రాసుకొంటోంది అంటావూ? అది ఆవిడ తప్పుకాదు. నీ లోపం" అన్నాను.

తాయారు కాలుకాలిన పిల్లిలాగా యిల్లంతా కలియ దిరిగింది. ఈలోగా యింటి ఖర్చులు దాదాపు 60, 70 రూపాయలు తగ్గినట్టు గుర్తించాను. ఒకటి రెండుసార్లు సమయం

చూసి రాజమ్మతో "నువ్వు చాలా బాగా వంట చేస్తున్నావు సుమా!" అన్నాను. రాజమ్మ చాలా సంతోషించినట్టు కనిపించింది. అలా పొగిడితే - యింటిని యింకా అంటిపెట్టుకొని ఉంటుందని నా ఆశ.

కాని మరో రెండు నెలలు గడిచాక హఠాత్తుగా రాజమ్మ ఇంట్లోంచి మాయమయింది.

"అదేం!" అన్నాను - బిక్కచచ్చిపోయి.

"మీరు ఆవిడ వంట చాలా బాగుందని పొగిడారట. జీతం పెంచమని కూచొంది. నేనిక పైసా ఎక్కువ యివ్వను. నీకిష్టం ఉంటే ఉండు. లేకపోతే మానెయ్ అన్నాను, వెళ్ళిపోయింది. పీడాపోయింది"-అంది తాయారు - ఇన్నాళ్ళకి అలాంటి అవకాశం దొరికినందుకు సంతోషిస్తూ.

నా పొరపాటు అర్థమయింది.

రాజమ్మ తాయారులోని 'వానిటీ'ని గుర్తుచేస్తే, నేను ఆమెని పొగిడి ఆమె 'వానిటీ'ని పెంచాను.

తక్కువ స్థాయిలోని వ్యక్తుల ఆడంబరం లాగే, పెద్దస్థాయి వాళ్ళ బుజ్జగింపు మనుషుల్ని పాడు చేస్తుందేమో మరి.

ఏదేనా రాజమ్మ వెళ్ళి పోయింది. కాని ఆవిడ ధర్మమా అని మా యింటి బడ్జెట్ మాత్రం చాలా మట్టుకు కుదుటపడింది.

----